RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 301 | పబ్లిషర్ : కొక్కురవికుమార్ | మంగళవారం 22 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

### యునైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం

దిగువ సభకు (స్టేట్ డుమా) జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడు పుతిన్ అనుకూల యునైటెడ్ రష్యా పార్టీ ఘన విజయం సాధించింది. చెప్పుకోదగిన ప్రతిపక్ష పార్టీలు లేకపోవడంతో పుతిన్ పార్టీ విజయం నల్లేరుమీద నడకలా మారింది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక రష్యాలో ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. రష్యా దిగువ సభలో మొత్తం 450 సీట్లు ఉంటాయి. వీటిలోని సగం సీట్లల్లో పార్టీలు అభ్యర్థులను పోటీలోకి దింపుతాయి. మిగిలిన సగం సీట్లలో (పార్టీ లిస్టు) ప్రజలు నేరుగా పార్టీలనే ఎంచుకుంటారు. పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.

### నిజామాబాద్‌లో ఏసీబీ దాడులు..

నిజామాబాద్ : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించడం కలకలం రేపింది. మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేసి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రిటైర్డ్ అయిన కార్పొరేషన్ ఉద్యోగి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ఫైల్ ప్రిపేర్ చేయడానికి రూ.35 వేలు లంచం డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌తో పాటు మరో ఉద్యోగిని రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సొంత ఉద్యోగుల బిల్లుల విషయంలో లంచం డిమాండ్ చేసిన వ్యవహారంపై ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో వల పన్ని ఇద్దరు ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

### హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా

## తీర్చిదిద్దుతాం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 : హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు(సోమవారం) హైదరాబాద్ లో 'హోమా జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈసందర్భంగా 'దిన్యూ పారాడైమ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్' ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్ అందిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్' కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు.

ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, స్టార్టప్‌లను హెల్త్‌కేర్‌తో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబా ద్‌లో సమగ్ర హెల్త్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. దయాబెటిస్, మెటబాలిక్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి అవసరమని మంత్రి తెలిపారు. లైఫ్‌స్టైల్ డేటా విశ్లేషణతో వ్యాధుల ను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉందనివివరించారు. దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలని సూచించా రు. హెల్త్‌కేర్ రంగంలో



కొత్త ఆలోచనలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వైద్య నిపుణులు, పరిశోధకులు ప్రభు త్వంతో కలిసి పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

## కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం: కడియం

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘనంగా ప్రారంభించారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీ ప్రతినిధులను శాలువాలతో సన్మానించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ప్రజాక్షేత్రంలో ఉంటూ రేవంత్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యేలా పట్టుదలతో పనిచేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. 'కొత్త, పాత' వ్యత్యాసాలు వీడి, కేవలం పార్టీ పేరు చెప్పుకుని తిరిగే సంస్కృతికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గడిచిన 12 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క జాతీయ సంస్థనుగానీ, రూ.1000 కోట్ల ప్రాజెక్టునుగానీ మంజూరు చేయకుండా కుల, మత రాజకీయాలతో చిచ్చు పెడుతోందని ఆరోపించారు. మరోవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా



చేసుకుంటూ, 2014 ఎన్నికల అఫిడవిట్‌లో ఒక్క ఎకరం భూమి కూడాలేదని చూపించిన కల్వకుంట్ల కుటుంబానికి పదేళ్ల పాలన తర్వాత నేడువందల ఎకరాలు, ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. 2014కి ముందు ఉన్న ఆస్తులు, ప్రస్తుతంఉన్న సంపదపై తెలంగాణ ప్రజలకు కేసీఆర్ కుటుంబం సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి సవాల్ విసిరారు.

### జూరాల ఆయకట్టు రైతాంగానికి

## నీటిని విడుదల చేయాలి: డీకే అరుణ

మహబూబ్ నగర్, సెప్టెంబర్ 21: కాంగ్రెస్ ప్రభుత్వంపై మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూరాల ఆయకట్టు రైతాంగానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈరోజు(సోమవారం) ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతాంగం నీటి కోసం అల్లాడుతుంటే.. ఎండాకాలం బూచి చూపడం సమంజసం కాదని మండిపడ్డారు. జూరాలలో ఇప్పటికీ నీరు సమృద్ధిగానే ఉందని తెలిపారు. ఎండా కాలానికి ఇక్కట్లు వస్తే.. ఎగువన కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని.. అప్పుడు నీటిని విడుదల చేయించుకోవచ్చని సలహా ఇచ్చారు. ప్రస్తుతం కృష్ణా నదికి ఇంకా వరద వచ్చే అవకాశం కూడా ఉందన్నారు. రైతులు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతుల ఆందోళనకు అండగా నిలుస్తామని ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. నిన్న(ఆదివారం) జూరాల ప్రాజెక్ట్ కింద కాలువలకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూరాల డ్యాం గద్వాల-ఆత్మకూరు రహదారిపై, కర్నూల్-గద్వాల రహదారిపై, కలెక్టరేట్ ముందు రైతులు ఆందోళన



చేసిన విషయం తెలిసిందే. రైతుల ఆందోళనకు బీజేపీ నేతలు మద్దతు తెలియజేశారు. అంతేకాకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎంపీ డీకే అరుణ ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. జూరాల ఆయకట్టు రైతాంగానికి సాగునీటిని విడుదల చేయాలని.. సాగు చేసిన పంటలను కాపాడాలని వినతి చేశారు.

### టీచర్లపై వైసీపీ దాడి..

## వదిలే ప్రసక్తే లేదంటూ మంత్రి లోకేశ్ వార్నింగ్

అమరావతి, సెప్టెంబర్ 21: విజయవాడలో డీఎస్సీ స్పోర్ట్ కోటా ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడి చేయడంపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. గురువులపై దాడి చేసిన వారిని ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. గురువులపై దాడి చేసిన క్రిమినల్ గ్యాంగ్‌లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. వాళ్ల భరతం పడతామని వార్నింగ్ ఇచ్చారు. అందరూ దైవంలా భావించే గురువులను వైన్ షాపులకు కాపలా పెట్టిన జగన్.. ఉపాధ్యాయులను గౌరవిస్తారని అనుకోవడం భ్రమ అని అన్నారు. అత్యుత్తమ ఆటతీరుతో రాష్ట్రం, దేశ సత్తాను ప్రపంచానికి చాటిన క్రీడాకారులను స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు అంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని వ్యాఖ్యానించారు. జగన్ ఫేక్ ముఠా తప్పుడు నిందలతో అవమానాలు పాలైన స్పోర్ట్స్ కోటా డీఎస్సీ 2025 టీచర్లు తమకు న్యాయం చేయాలంటూ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని మంత్రి తెలిపారు. క్రీడలతో దేశ పతాకాన్ని రెపరెపలాడించి, ప్రతిభతో టీచర్ ఉద్యోగం సాధించిన స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ ఫ్యాక్షన్ ముఠా శాప్ కార్యాలయం వద్ద దాడికి దిగిందని మండిపడ్డారు. రౌడీ షీటర్లు, గంజాయి- బ్లేడ్ బ్యాచులను టీచర్లపైకి ఉసిగొల్పడం జగన్ నేర మనస్తత్వాన్ని బయటపెట్టిందని విమర్శించారు. పూజించాల్సిన



గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేసిన జగన్ క్రిమినల్ గ్యాంగులను వదిలే ప్రసక్తి లేదన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలన్నారు. వైసీపీ ప్రేరేపిత రౌడీ షీటర్లు, గంజాయి-బ్లేడ్ బ్యాచుల పనిపడతామంటూ ఎక్స్‌లో లోకేశ్ పోస్ట్ చేశారు.

### దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై

## బుధవారం సుప్రీంలో విచారణ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో తెలంగాణ హైకోర్టు తనపై విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై దానం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో మెన్షన్ చేశారు. ఈపిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం బుధవారం(సెప్టెంబర్ 23) విచారణజరపనుంది. తెలంగాణ హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ దానం నాగేందర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇటీవల దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా తెలంగాణ హైకోర్టు ప్రకటించిన విషయం తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో దానంపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. దానంపై అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చింది.

## సిమ్ కార్డులపై కేంద్రం వార్నింగ్..

### అలాంటి వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,21:** దేశంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, సిమ్ కార్డుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. అనుమతి లేకుండా ఇతరుల గుర్తింపు పత్రాలు ఉపయోగించి సిమ్ కార్డు తీసుకోవడం, జారీ చేయడం, టెలికాం గుర్తింపులను దుర్వినియోగం చేయడం, ఐఎంఈఐ నంబర్లలో అక్రమంగా మార్పులు చేయడాన్ని తీవ్ర నేరాలుగా పరిగణిస్తామని టెలికమ్యూనికేషన్ విభాగం వెల్లడించింది. ఇలాంటి నేరాలకు మూడేళ్ల వరకు జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలలో ఇటీవల చేపట్టిన సైబర్ నేరాల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్, పౌరులకు తెలియకుండా వారి గుర్తింపు కార్డులతో అక్రమంగా 25 మొబైల్ కనెక్షన్లను యాక్టివేట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై వెంటనే స్పందించిన ఐసీ సంబంధిత ఏజెంట్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి టెలికాం




సేవలను నిలిపివేసింది. అక్రమంగా కేటాయించిన 25 సిమ్ నంబర్లను డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా రీ-వెరిఫికేషన్‌కు పంపగా ప్రక్రియ విఫలమవ్వడంతో ఆ నంబర్లను డియాక్టివేట్ చేశారు.

## రష్యా పార్లమెంట్ ఎన్నికల వేళ ఉక్రెయిన్ భారీ డ్రోన్ల దాడి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,21:**రష్యా పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ చివరి రోజైన ఆదివారం ఉక్రెయిన్ బలగాలు రష్యా రాజధాని మాస్కో లక్ష్యంగా చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ డ్రోన్ దాడులతో విరుచుకు పడ్డాయి. ఉక్రెయిన్ ప్రయోగించిన వెయ్యికి పైగా డ్రోన్లలో కేవలం మాస్కో వైపు దూసుకొచ్చిన 450కి పైగా డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చి వేసినట్లు మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ వెల్లడించారు. అయినప్పటికీ, రాజధాని నగరంలోని ఓ ప్రధాన చమురు శుద్ధి కర్మాగారం (ఆయిల్ రిఫైనరీ), పవర్ స్టేషన్ సహా పలు నివాస భవనాలపై డ్రోన్ శకలాలు పడటంతో భారీగా మంటలు చెలరేగాయి. మాస్కో పరిధిలో జరిగిన ఈ భీకర దాడుల్లో ఒక వృద్ధుడితో పాటు మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. దేశంలో జరుగుతున్న ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేందుకు కైవ్ పన్నిన ఈ కుట్రను భగ్నం చేశామని, ఎన్నికల స రళిపై ఇది ఎలాంటి ప్రభావం చూపలేదని రష్యన్ అధికార వర్గాలు పేర్కొన్నాయి. తమ గడ్డపై జరిగిన ఈ భారీ దాడికి ప్రతీకారంగా రష్యా సైన్యం వెంటనే ఎదురుదాడి ప్రారంభించి ఉక్రెయిన్ ప్రధాన నగరాలపై క్షిపణులు, ఆత్మాహుతి డ్రోన్లతో విరుచుకుపడింది.

రాజధాని కైవ్‌తో పాటు సుమీ ప్రాంతాల్లో రష్యా జరిపిన తాజా వైమానిక దాడుల్లో తల్లి, ఇద్దరు చిన్నారులు సహా పలువురు పౌరులు ప్రాణాలు




కోల్పోయి నట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. రష్యా సైనిక చర్యకు అవసరమైన నిధులను సమకూర్చే ఆయిల్, లాజిస్టిక్స్ కేంద్రాలనే తాము స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులతో లక్ష్యంగా చేసుకున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ స్పష్టం చేశారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా జరిగిన రష్యా పార్లమెంట్ ఎన్నికల ముగింపు రోజే ఇరుదేశాలు పరస్పరం సరిహద్దులు దాటి భీకర దాడులకు దిగడంతో తూర్పు ఐరోపాలో ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి.

### ఖరీదైన ప్రాంతాల్లోనే పేదలకు

## సొంత ఇళ్లు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: హైదరాబాద్ మహానగర పరిధిలో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గం మల్కం చెరువు సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ పేదలు తాము నివసిస్తున్న ప్రాంతాలకు సాధ్యమైనంత దగ్గరలోనే సొంతింటిని పొందేలా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పేదలను నగరానికి దూరంగా తరలించకుండా ఖరీదైన ప్రాంతాల్లోనే గౌరవంగా నివసించేలా ఇందిరమ్మ టవర్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం నాలుగు గోడలు, పైకప్పుతో పూర్తి చేయడం తమ ప్రభుత్వ లక్ష్యం కాదని మంత్రి అన్నారు. పేదవాడికి ఆత్మగౌరవంతో జీవించే చిరునామా ఇవ్వడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ భారీగా ఉన్న ప్రాంతాల్లోనే పేదలకు ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎకరం వందల




కోట్ల విలువ చేసే ప్రాంతంలో పేద కుటుంబాలకు ఇళ్లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వారికి భద్రత, భరోసా కల్పిస్తోందన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు 17 నుంచి 20 గజాల వరకు అన్‌డివైడెడ్ షేర్‌తో పాటు అపార్ట్‌మెంట్‌పై పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. సేల్ డీడ్‌ను ఎలాంటి రిజిస్ట్రేషన్ చార్జీలు లేకుండా అందించే విధంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావు లేదని మంత్రి స్పష్టం చేశారు.

# సంపాదకీయం


## బీసీ వర్గాలకు ఎట్టకేలకు దక్కిన న్యాయం..!

కీలకతీర్పును వెలువరించిన భారత సుప్రీంకోర్టు.. బీసీ వర్గాల రిజర్వేషన్ల విషయంలో ఒక పెద్ద అవరోధాన్ని తొలగించింది. క్రీమీలేయర్‌ను అన్వయించే అంశంపై స్పష్టతనిచ్చిన సుప్రీంకోర్టు..కొందరు ఉన్నతాధికారుల తప్పుడు వైఖరి కారణంగా ఇరవై రెండు యేళ్లుగా రిజర్వేషన్ల హక్కుకు దూరమైన బీసీ బిడ్డల హక్కులను సగౌరవంగా పునరుద్ధరించింది. కంటికి కనిపించని, న్యాయస్థానాల పరిశీలనకు చిక్కని కుల వివక్ష.. బడుగు వర్గాల అభ్యర్థుల విషయంలో అనేక విధాలుగా అమలవుతున్నది. మొన్న ఇచ్చిన తీర్పుతో సుప్రీంకోర్టు.. బీసీ అభ్యర్థులను నానా అగచాట్లు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దల మొండి వైఖరిపై మొట్టికాయలు వేసింది. క్రీమీలేయర్‌ను నిర్ణయించడానికి, ఆదాయాన్ని గణించడానికి అనుసరించిన విభిన్న ప్రమాణాలను వివక్షగా పేర్కొన్న సుప్రీంకోర్టు.. ఓబీసీ అభ్యర్థుల క్రీమీలేయర్ స్థితిని నిర్ణయించడానికి తల్లిదండ్రుల ఆదాయమే ఏకైక ప్రమాణం కాదని పేర్కొంది. నాటి విశ్వనాథ ప్రతాప్ సింగ్ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం కారణంగా.. దేశంలోని మెజారిటీ వర్గమైన బీసీలకు (జాతీయ స్థాయిలో ఓబీసీలు) కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో మొదటిసారిగా రిజర్వేషన్లు దక్కాయి. వెనుకబడిన వర్గాలకు చేయూతను అందించిన పాపానికి వీపీ సింగ్ చివరికి తన ప్రధాన మంత్రి పదవిని కోల్పోవాల్సి వచ్చింది. 1993 నుండి ఓబీసీ రిజర్వేషన్లు అమలు అయినవి. ఆ తర్వాత 2004లో డీఓపీటీ అదే అంశంపై ఒక వివరణ లేఖని విడుదల చేసింది. దీని ద్వారానే.. బీసీల ఉద్యోగావకాశాలను గద్దలు తన్నుకు పోయే కుతంత్రానికి తెర తీయబడింది. 2004 అక్టోబర్ 14న, కేంద్రం జారీ చేసిన లేఖలో.. ఖూజలు, బ్యాంకులు, ప్రైవేటు సంస్థల విషయంలో.. ఆయా సంస్థలలోని ఉద్యోగుల కేటగిరీలను ప్రభుత్వ సంస్థలలోని పోస్టులతో సమానత్వ మూల్యాంకనం చేయనట్లయితే, ఆదాయ సంపద పరీక్ష ఆధారంగా క్రీమీలేయర్ స్థితిని తప్పనిసరిగా నిర్ణయించాలని గుర్తించింది. వేతనాల నుండి వచ్చే ఆదాయం, ఇతర వనరుల నుండి వచ్చే ఆదాయాన్ని (జీతాలు మరియు వ్యవసాయ భూమి మినహా) విడిగా అంచనా వేయాలని నిర్దేశించింది. ఇటు వేతన ఆదాయం కానీ.. అటు ఇతర వనరుల నుండి వచ్చే ఆదాయం కానీ.. వరుసగా మూడు సంవత్సరాలు నిర్దేశించిన పరిమితిని మించితే.. వారి పిల్లలు క్రీమీలేయరుగా పరిగణించబడ తారని పేర్కొన్నది. ఈ లేఖ కారణంగా.. క్రీమీలేయర్ నిర్ధారణ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు దక్కిన వెసలుబాటు.. ఖూజలు, బ్యాంకులు, ప్రైవేటు సంస్థల ఉద్యోగులకు దక్కకుండా పోయింది. ఆదాయాన్ని లెక్కించేటప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో జీతపు ఆదాయాన్ని పరి గణనలోకి తీసుకోవద్దన్నారు. అదే పీఎస్‌యూ, బ్యాంకులు, ప్రైవేటు సంస్థల ఉద్యోగుల విషయంలో మాత్రం.. జీతపు ఆదాయాన్ని లెక్కించడం మొదలుపెట్టారు.. ఈ భేద భావం.. చాలా మంది బీసీ వర్గాల పిల్లలకు, రిజర్వేషన్ హక్కు దక్కకుండా చేసింది. మొన్న ఇచ్చిన తీర్పుతో సుప్రీంకోర్టు.. బీసీ అభ్యర్థులను నానా అగచాట్లు పెడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దల మొండి వైఖరిపై మొట్టికాయలు వేసింది. న్యాయమూర్తులు పిఎస్ నరసింహ, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. వెనుక బడిన వర్గాల వారికి దక్కాల్సిన ప్రయోజనాలను ఓబీసీలలోని సామాజికంగా అభివృద్ధి చెందిన వర్గాలు కైవసం చేసుకోకుండా నిలువరించడం కోసమే క్రీమీలేయర్‌ను మినహాయించడం తప్ప.. అదే సామాజిక వర్గానికి చెందిన సమాన స్థానాల్లో ఉన్న సభ్యుల మధ్య కృత్రిమ వ్యత్యాసాలను సృష్టించడం కాదు. అని స్పష్టీకరించింది. హేతుబద్ధమైన సమర్థన లేకుండా అదే వెనుకబడిన తరగతిలోని ఒక వర్గానికి ప్రతికూలతలు కలిగించే వ్యాఖ్యానాన్ని అవలంబించడం సమానులను అసమానులుగా పరిగణించడమేనని, అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ప్రైవేట్ సంస్థలు, పీఎస్‌యూలు, బ్యాంకుల ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులకు భిన్నంగా పరిగణించడం, దాని ఆధారంగా రిజర్వేషన్ అర్హతను నిర్ణయించడం వివక్షకు సమానం అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆఫీస్ మెమోరాండంలో ప్రస్తావించిన అంశాల్లో ఏదైనా అస్పష్టత ఉంటే వివరణ లేఖల ద్వారా ఆ అస్పష్టతను తొలగించవచ్చు తప్ప.. ఆఫీసు మెమోరాండం ద్వారా దాఖలు పడిన హక్కులను ఆ తర్వాత ఇవ్వబడిన వివరణ లేఖ ద్వారా రద్దు పరచడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అంతిమంగా.. సదరు ఓబీసీ అభ్యర్థులను నాన్ క్రీమీ లేయర్‌గా పరిగణించాలని, వారికి దక్కాల్సిన ఉద్యోగాలను.. సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి మరీ అందించాలని.. కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అర్హతలు సాధించిన బీసీ అభ్యర్థులు ఉన్నా సరే.. నాట్ ఫౌండ్ సూటబుల్ అనే నిబంధనను ఉపయోగించి.. బీసీలకు దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలను ఖాళీగానే ఉంచుతున్నారు. మరోవైపు మోడీ ప్రభుత్వం లాటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా రిజర్వేషన్ నిబంధనలు పక్కకు నెట్టేసి ఆధిపత్య వర్గాలకు చెందిన అభ్యర్థులతో ఉన్నత స్థానాలను నింపేస్తున్నది. మండల్ కమిషన్ అమలు ద్వారా 27% రిజర్వేషన్ల హక్కు బీసీ వర్గాలకు దక్కి నేటికీ 33 ఏళ్లు గడుస్తున్నా.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో నేటికీ 17 శాతం మాత్రమే బీసీ అభ్యర్థులు కొలువు తీరారు. ఉన్నత స్థాయి పదవుల్లో మరింత హీనంగా కేవలం నాలుగు శాతం బీసీ అభ్యర్థులే స్థానం సంపాదించగలిగారు. కంటికి కనిపించని, న్యాయస్థానాల పరిశీలనకు చిక్కని కుల వివక్ష.. బడుగు వర్గాల అభ్యర్థుల విషయంలో అనేక విధాలుగా అమల వుతున్నది. మనువు చేసిన అరాచకాలు మాసిపోవడానికి, దేశ ప్రజలకు సమన్యాయం దక్కడానికి.. ప్రయాణించాల్సిన దూరం ఇంకా చాలా మిగిలి ఉందన్నది స్పష్టం.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి:మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్ష నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, సీఎస్




నిజామాబాద్, సెప్టెంబర్ 21 ( ప్రజాగళం ప్రతినిధి )నీటి పారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, నీటి పారుదల ప్రాజెక్టులకు అవసరమైన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ. 1,050 కోట్లు, మరోసారి రూ. 1,500 కోట్లు కలిపి మొత్తం రూ. 2,550 కోట్లు విడుదల చేసినట్లు గుర్తు చేశారు. అయితే విడుదలైన నిధుల్లో సింహభాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు అందించకపోవడం పట్ల ఒకింత చేరకపోవడం ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిధులు చాలకపోయినా, ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోతే ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని సకాలంలో భూసేకరణ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ. 3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ. 2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ భుజంగరావు, నిజామాబాద్, బోధన్ ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## భారీగా పెరిగిన బియ్యం ధరలు




హైదరాబాద్: తెలంగాణలో బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ధరల పెరుగుదల మరింత ఎక్కువగా నమోదవుతోంది. ఈ పరిస్థితికి ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులపై నెలకొన్న ఆందోళనలు ఒక కారణమైతే,.. ప్రైవేటు వ్యాపారులు భారీగా బియ్యాన్ని నిల్వ చేయడం మరో ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. మే నుంచి జులై మధ్య దేశవ్యాప్తంగా బియ్యం రిటైల్ ధరలు సగటున 3.33 శాతం పెరిగాయి. అదే కాలంలో తెలంగాణలో మాత్రం 4.65 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం రాష్ట్రంలో బియ్యం సగటు రిటైల్ ధర కిలోకు రూ. 52.67గా ఉండగా.. ఇది దేశ సగటుతో పోలిస్తే దాదాపు రూ. 10 ఎక్కువ. ప్రముఖ రకాల సన్నబియ్యం ధరలు కిలోకు రూ. 54 నుంచి రూ. 70 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు.. ఎల్‌నినో ప్రభావంతో పంటపై ఆందోళనలు నెలకొనడంతో ధరలు పెరిగాయని చెప్పారు. రానున్న నెలల్లో పంట బాగా వస్తే ధరలు మళ్లీ తగ్గే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు. అయితే ధరల పెరుగుదలకు ఎల్‌నినో ఒక్కటే కారణం కాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం బాగానే ఉన్నందున సరఫరాలో పెద్ద అంతరాయం లేదన్నారు. అయినప్పటికీ ధరలు పెరగడానికి ప్రైవేటు వ్యాపారుల నిల్వలు కూడా ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పొందించిన పాలసీ పత్రం ప్రకారం.. భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, ఎరువులు-ఇంధన వ్యయాల పెరుగుదల, ఆసియా దేశాల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో బియ్యం ధరలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. పాలసీ పత్రంలో మూడు రకాల పరిస్థితులను ప్రస్తావించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న రోజుల్లో బియ్యం ధరలు అకస్మాత్తుగా ఎగబాకే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం హెచ్చరించింది. ప్రస్తుతానికి మార్కెట్‌లో ధాన్యపు నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ.. భవిష్యత్తులో ఏర్పడే వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బియ్యం వ్యాపారాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని తాజా పాలసీ పత్రంలో స్పష్టం చేశారు. సెంటర్ ఫౌండింగ్ డైరెక్టర్ సమరేందు మోహంతి, పీజేటీఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ఆసియాలోని ప్రధాన వరి సాగు ప్రాంతాలపై ఎల్ నినో ప్రభావం పడితే, దిగుమతి చేసుకునే దేశాలు ముందుగానే నిల్వలు పెంచుకోవడానికి మొగ్గు చూపుతాయి. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా బియ్యం ధరలు యావరేజ్‌గా 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అధ్యయనం అంచనా వేసింది. ఉత్పత్తి స్థిరంగా ఉండి, ప్రభుత్వాలు ఎగుమతి ఆంక్షలు విధించకపోతే, ఆందోళన కొనుగోళ్లు లేకపోతే ధరలు కేవలం 10 నుంచి 20 శాతం వరకు మాత్రమే పెరుగుతాయన్నారు. మధ్యస్థ ఉత్పత్తి నష్టాలు, ఆగ్నేయాసియా దేశాలు ముందు జాగ్రత్త చర్యగా నిల్వలు పెంచుకోవడం వల్ల ధరలు 30 నుంచి 50 శాతం వరకు ఎగిసే అవకాశం ఉందని చెప్పారు. తీవ్రమైన ఉత్పత్తి నష్టాలు, విస్తృతమైన ఎగుమతి నిషేధాలు, పానిక్ బైయింగ్ చోటు చేసుకుంటే మాత్రం గ్లోబల్ మార్కెట్‌లో బియ్యం ధరలు ఇప్పుడున్న ధరలకు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రపంచ బియ్యం మార్కెట్‌ను స్థిరీకరించడంలో భారత్ పాత్ర అత్యంత కీలమని అధ్యయనం స్పష్టం చేసింది. ఉత్పత్తి, ఎగుమతులు, ప్రభుత్వ ఆహార ధాన్యాల నిల్వల్లో భారత్ అగ్రగామిగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. అయితే, దేశీయ అవసరాలరీత్యా భారత్ మళ్లీ ఎగుమతులపై ఆంక్షలు విధిస్తే.. అది అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదలను మరింత వేగవంతం చేస్తుందని హెచ్చరించారు. ఎలాంటి సంక్షోభాలనైనా ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం, పారదర్శకమైన వాణిజ్య విధానాలు, ఎప్పటికప్పుడు సరైన మార్కెట్ సమాచారం అందుబాటులో ఉండటం చాలా అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే నిత్యవసర ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో ఇప్పుడు బియ్యం ధరలు కూడా పెరిగితే సామాన్యుల జీవనం కష్టతరమవుతుందని అంటున్నారు. ఇలా అయితే జీవించటం కష్టమేనని అంటున్నారు. పంట ఉత్పత్తి సాధారణంగా ఉండి, భారీ కొనుగోళ్లు జరగకపోతే ధరలు 10-20 శాతం వరకు మాత్రమే పెరగొచ్చని పేర్కొంది. అయితే ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు ఉన్న పరిస్థితిలో.. మోస్తరు దిగుబడి తగ్గుదల, నిల్వల పెరుగుదల కారణంగా ధరలు 30-50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. ఒకవేళ ఎగుమతి ఆంక్షలు, భయంతో భారీ కొనుగోళ్లు జరిగితే ప్రపంచ బియ్యం ధరలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రానున్న ఖరీఫ్ పంట ఆశించిన స్థాయిలో వస్తే బియ్యం ధరలు క్రమంగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. అయితే ఎల్‌నినో ప్రభావం కొనసాగడం, నిల్వలు పెరగడం వంటి అంశాలు కొనసాగితే వినియోగదారులపై ధరల భారం మరింత పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తొట్టెల బుట్టలకు ఫుల్ డిమాండ్

హైదరాబాద్ : బోనాల ఉత్సవాలు తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధమైన పండుగలలో ఒకటి. ఈ పండుగలో అమ్మవారికి బోనం సమర్పించడం ఎంతో ముఖ్యమైన ఘట్టం. అయితే, ఈ ఉత్సవాల్లో తొట్టెల సమర్పణ కూడా ప్రత్యేకమైన ప్రాధాన్యతను కలిగి ఉంది. భక్తులు తమ మొక్కులు నెరవేరాలని, కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యం కోసం అమ్మవారికి తొట్టెలను సమర్పిస్తారు. ఈ సందర్భంగా, భక్తుల అభిరుచి మరియు మొక్కుల ప్రకారం, తొట్టెల పరిమాణం మారుతుంది. కొందరు చిన్న తొట్టెలను సమర్పిస్తుంటే, మరికొందరు భారీ, ప్రత్యేకంగా తయారు చేసిన తొట్టెలను సమర్పించడం బోనాల ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఈ తొట్టెల తయారీకి సంబంధించిన కళ, కార్వాన్, పురానాపూల్ ప్రాంతాల్లోని కొన్ని కుటుంబాలకు ప్రధాన జీవనాధారంగా మారింది. తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఈ సంప్రదాయ వృత్తిని నమ్ముకుని నేటికీ అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ తొట్టెలను వెదురు, రంగురంగుల కాగితాలు, అలంకరణ సామగ్రితో చేతిపనిగా రూపొందించడం జరుగుతుంది. ప్రతి ఏడాది, భక్తుల నుంచి ఈ తొట్టెలకు భారీ డిమాండ్ ఉంటుంది. ఈ డిమాండ్ కారణంగా, తొట్టెల ధరలు కూడా విభిన్నంగా ఉంటాయి. సాధారణ తొట్టెల ధరలు రూ. 500 నుంచి ప్రారంభమవుతుండగా, భారీ బహుళ అంతస్తుల తొట్టెల ధరలు రూ. 2 లక్షల వరకు చేరుకుంటున్నాయి. ఈ ధరలు, తయారీకి ఉపయోగించే సామగ్రి, అలంకరణ మరియు పరిమాణం ఆధారంగా మారుతుంటాయి. బోనాల ఉత్సవాల్లో తొట్టెల తయారీకి సంబంధించిన ఈ కళ, కేవలం ఆర్థిక వనరులే కాకుండా, సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఈ సంప్రదాయాన్ని కొనసాగించడానికి, యువతను ప్రోత్సహించడం, ఈ కళను నేర్పించడం అత్యంత అవసరం. ఈ విధంగా, భవిష్యత్తులో కూడా ఈ కళను కొనసాగించడానికి వీలు కల్పించవచ్చు.

## జెండా గుడిని దర్శించుకున్న అర్బన్ ఎమ్మెల్యే



నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 21( ప్రజా గళం )నగరంలోని జెండా బాలాజీ ఆలయాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితికి ముందు ఇందూరులో జెండా ఉత్సవాలు నిర్వహించడం సాంప్రదాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా తాను జెండా జాతరలో పాల్గొంటున్నానని గుర్తు చేసుకున్నారు. జెండాను నగర పురవీధుల్లో శోభాయాత్రగా ఊరేగింపు తీయడం, బాలాజీ ఆలయంలో వారం రోజుల పాటు పూజించడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, నాయకులు మారావార్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ గణేష్ మండలి గణనాథున్ని దర్శించుకున్న బాజిరెడ్డి జగన్.




నిజామాబాద్ సిటీ , సెప్టెంబర్ 21( ప్రజాగళం ) జిల్లా కేంద్రంలోని నాలుగవ డివిజన్ ఈస్ట్ బ్యాంక్ కాలనీలో ఏర్పాటుచేసిన శివాజీ గణేష్ మండలి గణనాథున్ని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బాజిరెడ్డి జగన్ సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాజీ గణేష్ మండలి 6వ వార్షికోత్సవం సందర్భంగా మహా అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న బాజిరెడ్డి జగన్ ను గణేష్ మండలి సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కాలనీలోని యువత ముఖ్యంగా చిన్నపిల్లలు గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, బీఆర్ఎస్ పార్టీ నాల్గవ డివిజన్ నాయకుడు మల్లెపూల నరసింహ చారి,అరుణ్, భరత్, ధనుష్ రెడ్డి, వెంకటేష్,సిద్ధార్థ్, స్వరణ్, సంకిర్థ్, చరణ్, కార్తికేయ, సుప్రీత్,సుశ్రీత్,కాలనీ మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 111 ఫిర్యాదులు



నిజామాబాద్ సిటీ,సెప్టెంబర్ 21 ( ప్రజాగళం ) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 111 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్, ట్రైనీ ఆర్డీఓ సందీప్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఎడపల్లి లక్ష్యంగా ముందుకు సాగాలి...బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు పిలుపు ...








ఎడపల్లి,సెప్టెంబర్ 21: (ప్రజా గళం) స్వచ్ఛ ఎడపల్లి లక్ష్యంగా మనం ముందుకు సాగాలని బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు పిలుపునిచ్చారు. ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా అనే కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్ మిషన్ అంశం పై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్,ఎంపిఓ. మోహన్ శాస్త్రి,కార్యదర్శి గంగాధర్, ఎస్ బిఎం కో-ఆర్డినేటర్ రాజు,ప్రధానోపాధ్యాయులు రవికుమార్,ఉపాధ్యాయ బృందం,గ్రామ వార్డు సభ్యు లు బర్దీపూర్ విఠల్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నా రు.

## 7 వ బెటాలియన్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్రుల కోర్సులో భాగంగా,అలీసాగర్ లో వరద సహాయక చర్య లపై ప్రత్యేక శిక్షణ....



ఎడపల్లి,సెప్టెంబర్ 21: (ప్రజా గళం)7 వ బెటాలియన్‌లో నిర్వహిస్తున్న యువ ఆపద మి త్రుల(వైఏఎంఎస్) కోర్సులో భాగంగా నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం అలీసాగర్ బోటింగ్ తో పాటు వరద సహాయక చర్యలపై ఆదివారం ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా యువ ఆపదమిత్రుల కు అలీసాగర్ రిజర్వాయర్ లో బోటింగ్ నిర్వహణ పాటు,నీటిలో సురక్షితంగా ప్రయాణించడం,ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,అలాగే నీటిలో ప్రమాదాలకు గురైన వారిని రక్షించే విధానాలపై ప్రాక్టిక ల్ శిక్షణ అందించారు.వరదల సమయంలో నీటిలో చిక్కుకున్న వ్యక్తులను గుర్తించడం,వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చడం,రెస్క్యూ పరికరాలు అలాగే లైఫ్ జాకె ట్లను సరైన విధంగా వినియోగించడం వంటి అంశాల ను శిక్షకులు ప్రదర్శన ద్వారా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో స్వీయ భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పరిస్థి తిని అంచనా వేసి,శిక్షణ పొందిన విధానాల ప్రకారం మాత్రమే రెస్క్యూ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారికి తక్షణ సహాయం అం దించడంతో పాటు,సంబంధిత రెస్క్యూ బృందాలకు సమాచారం అందించడం కూడా ముఖ్యమని తెలిపారు.ఈ శిక్షణ ద్వారా యువ ఆపదమిత్రుల్లో విపత్తు సమయాల్లో ప్రజలకు సహాయం అందించే నైపుణ్యా లు,అప్రమత్తత అట్లాగే అత్యవ సర పరిస్థితులను సమర్థవం తంగా ఎదుర్కొనే సామ ర్థ్యంపెంపొందించబడింది.ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్,ఇతర అధికారులు,శిక్షకులు ఉన్నారు.

## ఈ నెల 22- 25 తేదీలలో బోధన్ పట్టణంలో నిర్వహించే గణేష్ నిమజ్జనం వేడుకల్లో డిజె లు నిషేధం...

### డిజె లు వాడితే.... బోధన్ పట్టణ సిఐ వెంకటనారాయణ హెచ్చరిక...ప్రశాంతంగా ఆనందోత్సాహల మధ్య నిమ జ్జనం జరుపుకోవాలి...సిఐ,నిర్వాహకులకు,ప్రజలకు విజ్ఞప్తి...

బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 21: (ప్రజా గళం)ఈ నెల 22 అలాగే 25 వ తేదీలలో బోధన్ పట్టణంలో నిర్వహించే గణేష్ నిమజ్జనోత్సవ వేడుకల్లో డిజె లు వినియోగించ వద్దని,డిజెలు నిషేదించడం జరిగింది అని బోధన్ పట్టణ సిఐ వెంకటనారాయణ స్పష్టం చేశారు.



ఈ సందర్భంగా సిఐ సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.విగ్రహ నిర్వాహకులు శోభా యాత్ర ల్లో డీజే వాడటం నిషేధించడం జరిగింది అని,నిజామా బాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేర కు డిజె లు వాడితే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా డీజే సౌండ్స్ పెట్టిన ఉత్సవ నిర్వాహకులపై అలాగే డీజే ఓనర్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవ డం జరుగుతుంది అని సిఐ వెంకటనారాయణ తెలిపా రు.ఈ సందర్భంగా
గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకు లు,ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గణేష్ నిమజ్జన ఉత్సవ వేడుకలు ఆనందోత్సాహల మధ్య,డప్పు వాయిద్యాలు,బ్యాండ్ మేళాలు చప్పుళ్ల మధ్య సంతోషంతో నృత్యాలు చేస్తూ,ప్రశాంతంగా, శాంతి భద్రతలకు విగాతం కలిగించకుండా నైమజ్జనో త్సహా వేడుకలు జరుపుకోవాలని సిఐ వెంకటనారాయ ణ నిర్వాహకులకు,ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఏసీబీకి చిక్కిన అవినీతి చేపలు

## రిటైర్డ్ మహిళా ఉద్యోగి నుంచి 15 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

నిజామాబాద్ సెప్టెంబర్ 21 ( ప్రజాగళం ప్రతినిధి) నిజామాబాద్ నగర పాలక సంస్థ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. వరుస ఏసీబీ దాడులతోనూ ఉద్యోగుల వసూళ్ల పర్వం ఆగడం లేదు. తాజాగా ఓ రిటైర్డ్ మహిళా ఉద్యోగి నుండి నగరపాలక సంస్థ కార్యాలయంలోని గణాంకాల విభాగంలో 15వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పి చంద్రశేఖర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి.నిజామాబాద్మున్సిపల్ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగిని బెనిఫిట్స్, పెన్షన్ కి సంబంధించిన ఫైలు ముందుకు జరిపేందుకు విభాగం అధికారులు 15000 డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఏసీబీకి పట్టుబడ్డారు. నగరపాలక సంస్థ కార్యాలయం లోని గణాంకాల విభాగం లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ పాల్దా అశోక్, ఔట్సోర్సింగ్ ఉద్యోగి కిరణ్ లు మున్సిపల్ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగిని బెనిఫిట్స్ పెన్షన్కు సంబంధించిన ఫైలు ను ముందుకు జరిపేందుకు 15 వేల రూపాయలు ఇవ్వమని కోరడంతో బాధితులకు లంచం ఇచ్చే ఉద్దేశం లేకపోవడంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అశోక్, ఔట్సోర్సింగ్ ఉద్యో




గి కిరణ్‌లు15 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులువారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.వారి వద్ద నుంచి 15 వేల రూపాయలు స్వాధీనం చేసుకోనీ లంచం కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టు హైదరాబాద్ కి తరలిస్తున్నామని ఏసీబీ డీఎస్పి శేఖర్ గౌడ్ తెలిపారు. ఏసీబీ దాడులతో నగరపాలక సంస్థ కార్యాలయం ఉద్యోగుల్లో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది.

## ఇప్పుడు అదిలాబాద్ ఎయిర్ పోర్టు క్రెడిట్ వార్



**అదిలాబాద్,** : ఏపీలో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ప్రారంభం కాగా, దీనిపై కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ ఇది తమ ఘనతేనని క్లెయిమ్ చేస్తున్నాయి. తమ హయాంలోనే దాదాపు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తికాగా, సీఎం చంద్రబాబు ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేశారని వైసీపీ అంటోంది. తాము ఏది సాధించినా క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవడం వైసీపీకి అలవాటు అయిందంటూ కూటమి నేతలు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ విషయంలోనూ క్రెడిట్ గేమ్ మొదలైంది. సాధించింది తామేనని బీజేపీ నేతలు చెబుతంటే, బీజం వేసింది తానేనని, మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీ అని మాజీ ఎంపీ సోయం బాపూరావు వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మంజూరు, పనులకు అనుమతులపై మాజీ ఎంపీ సోయం బాపూరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ మంజూరు చేసింది కాంగ్రెస్ పార్టీనే అని, దానికి గతంలో బీజం వేసింది తానేనని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, రాజ్ గోండ్‌సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు హాజర య్యారు. ముందుగా గ్రామనికి చేరుకున్న నాయకులకు స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనం తరం పార్టీ బలోపేతం కోసం దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పార్టీ శ్రేణఉలకు పిలుపునిచ్చా రు.మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కృషితో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలతో ఆదిలాబాద్ జిల్లా కు ఎయిర్ పోర్ట్ మంజూరు అయ్యిందన్నారు. తాను ఎంపీగా ఉ న్నప్పుడే ఆదిలాబాద్ జిల్లాకు విమానాశ్రయం కోసం అప్పటి కేంద్ర మంత్రులకు ప్రధానికి వినతిపత్రాలు ఇచ్చానని, అంటే ఈ ఎయిర్‌పోర్ట్ కోసం ముందస్తుగా బీజం వేసింది తానేనని గుర్తు చేశారు. దానికి సాక్ష్యం బీజేపీ ఎమ్మెల్లే పాయల్ శంకర్ అన్నారు. కానీ స్థానిక ఎమ్మెల్లే, బీజేపీ నాయకులు తామే ఆదిలాబాద్ కు విమానాశ్రయం తెచ్చింది తామేనని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

## గణేష్ నిమజ్జోత్సవానికి సౌండ్ బాక్స్ లకు అనుమతివ్వాలి ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో ఏసీపీ ,సీఐకి వినతి

ఆర్మూర్ సెప్టెంబర్ 21 ( ప్రజా గళం) ఆర్మూర్ నియోజకవర్గంలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జనానికి సౌండ్ బాక్సుకు అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ అధికారులను కోరారు. ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, సీఐ సత్యనారాయణ గౌడ్ లను కలిసి వినతి పత్రం అందించగా వారు సానుకూలంగా స్పందించారు.ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు వినతి పత్రం అందించడం జరిగింది.ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సాయి బాబాగౌడ్ అద్వర్యం లో ఏసీపీ కార్యాలయంలో వెంకటేశ్వర్ రెడ్డి ని,పట్టణ సీఐ సత్యనారాయణ గౌడ్ ని కలిసి ఆర్మూర్ పట్టణం లో అంగరంగ వైభవంగా జరిగే వినాయక నిమ్మజన శోభ యాత్రకు రెండు టాప్ లను ఒక బేస్ లకు అనుమతి కోరారు. తమ వినతికి ఏసీపీ ,సీఐ దీనికి సానుకులం గా



స్పందించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ గొనె రఘు ,కౌన్సిలర్ లు నర్మె నవీన్ , గుపాల భుపెందర్,తాటి హన్మాండ్లు ,గంగాధర్ గౌడ్ నాయకులు బాబ్బ్యా ,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఐడిఓసి కాంప్లెక్స్‌లో క్యాబిన్ లు ప్రారంభం

నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 21 (ప్రజా గళం ) నిజామాబాద్ జిల్లాలోని సమీకృత కలెక్టర్ సముదాయాల కాంప్లెక్స్ లో క్యాబిన్లను ఏర్పాటు చేశారు.మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో, బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ ఐడిఓసి కాంప్లెక్స్‌లో తలులు తమ చిన్నారులకు సౌకర్యవంతంగా, గోప్యతతో పాలిచ్చేందుకు ఏర్పాటు చేసిన బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్లను సోమవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ అధికారి గీత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి రాజశ్రీ,, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా సంక్షేమ అధికారి సౌందర్యాలు ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఉద్యోగులు, సందర్శకులు, ఐడిఓసి కాంప్లెక్స్‌కు వచ్చే తల్లులు తమ శిశువులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పాలిచ్చేందుకు ఈ క్యాబిన్లు ఉపయోగపడతాయని తెలిపారు. శిశువులకు తల్లిపాలు అందించడం వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో ముఖ్యమని, తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ద్వారా బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, మహిళల సాధికారతకు సంబంధించిన



పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. తల్లులు, శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇటువంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో డిచ్పల్లి సిడిపిఓ పర్వత్ , సూపరింటెండెంట్, శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్, మహిప ల్ , ప్రణతి,డి హెచ్ ఈ డబ్ల్యూ, డి ఎం సి స్వప్న , జెండర్ స్పెషలిస్ట్ లు, స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్షి లిటరసీ, అకౌంటెంట్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలో పనిచేస్తూ మృతి చెందిన కుటుం బ సభ్యులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి

### -టియు సిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్ డిమాండ్.... కుటుంబ సభ్యులతో కలిసి టియుసిఐ ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేత..

బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 21: (ప్రజా గళం)బోధన్ మండలం భిక్నెల్లి గ్రామపంచాయతీలో పనిచే స్తూ,ప్రమాదవశాత్తు మృతి చెందిన బాగారే యాదు, బాగారే బాలాజీల కుటుంబ సభ్యులకు ఇచ్చిన హామీ లను తక్షణమే అమలు చేసి న్యాయం చేయాలని టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్ డిమాం డ్ చేశారు.బాధిత కుటుం బ సభ్యులతో కలిసి టియుసిఐ ఆధ్వర్యంలో సోమవా రం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణిలో ఆర్డీవో విజయకుమారి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ..2025 సెప్టెంబర్ 11న భిక్నెల్లి గ్రామానికి చెందిన జీపీ కార్మికులు బాగారే యాదు,బాగారే బాలాజీ లు ట్రాక్టర్ పై రాంపూర్ గ్రామం నుండి ట్రాన్స్ఫార్ కరెంటు స్తంబాలను తీసుకువస్తుంటే మార్గమధ్యంలో ట్రాక్టర్ బోల్తాపడి స్తంభాల కింద పడి మృతి చెందడం జరిగింది అని తెలిపారు.వారి కుటుం బ సభ్యులకు సబ్ కలెక్టర్ ప్రభుత్వం తరఫున ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు.భిక్నెల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్నటువంటి బాగారే యాదు, బాగారే బాలాజీ లను గత సంవత్సరం సెప్టెంబర్ నెల 11వ తేదీన రాంపూర్ గ్రామంలో గల ట్రాన్స్ఫారం నుండి కరెంటు పోల్స్ (స్తంభాలను)లను తీసుకురావ డానికి ట్రాక్టర్ తో పంపగా వాటిని తీసుకుని వచ్చేట ప్పుడు ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందారు.దానికోసం వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలనీ పోస్టు మార్టం కోసం బోధన్ లోని జిల్లా ఆసుపత్రికి తీసుకురా గా ఆ రోజు మృతుల కుటుంబ సభ్యులు అలాగే బంధు మిత్రులతో కలిసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేశామని,అయితే ఆ రోజు సబ్



కలెక్టర్ కార్యాలయం నుండి సంబంధిత అధికారులు, బోధన్ ఎస్ఐ,సీఐలు,ఎంపీడీవో,తహసీల్దార్ లు వచ్చి మాతో వారి కుటుంబ సభ్యులతో మాట్లాడటం జరిగిం ది అని,సబ్ కలెక్టర్ దగ్గరికి తీసుకువెళ్లి చర్చలు జరప గా సబ్ కలెక్టర్ వారి కుటుంబాలను ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని యాదు కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం,రెండు ప్రభుత్వ ప్లాట్లు, రెండు లక్షల ఆర్థిక సహాయం ఇస్తామని,బాలాజీ కుటుంబం కు ఒక లక్ష రూపాయాల ఆర్థిక సహాయంతో పాటు ప్రభుత్వ స్థలంలో ఇంద్రమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు.నేటికీ సంవత్సరం గడిచి పోయిన ఇచ్చిన హామీలను నెరవేర్చలేరని విమర్శిం చారు.ఇప్పటికైనా వారికి నాడు చెప్పిన మాట ప్రకారం హామీలను వెంటనే నెరవేర్చాలని బి.మల్లేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ నాయకులు బి. నాగేశ్వర్,సోన్ కాంబ్లే విట్టల్,వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ సిసి"ఏ"సర్టిఫికెట్ పొందిన ఇందూర్ హై స్కూల్ విద్యార్థులు....

### పాఠశాలలో 15వ బ్యాచ్ ఎన్ సిసి క్యా డేట్ లు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వంగా ఉంది.... ఇందూర్ హై స్కూల్ కరస్పాండెంట్,ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ కుమార్ వెల్లడి....



బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 21: (ప్రజా గళం)బోధన్ పట్టణంలోని ఇందూర్ హై స్కూల్ లో సోమవారం ఎన్ సిసి"ఏ"సర్టి ఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్న ఎన్‌సిసి క్యాడేట్ విద్యార్థులకు సర్టిఫికెట్ లు పంపిణి చేశారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన నిజామాబాద్ 12(టి) బిఎన్ ఎన్ సిసి,సుబేధర్ బల్విందర్ సింగ్ చేతుల మీదుగా పంపిణి చేశారు.56 మంది ఎన్ సిసి క్యాడేట్ లకు సర్టిఫికెట్ లను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఎన్ సిసి విద్యార్థులను ఉద్దే శించి ఇందూర్ హై స్కూల్ కరస్పాండెంట్,ట్రాస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ కుమార్ మాట్లాడుతూ..మన పాఠశాలలో 15వ బ్యాచ్ ఎన్ సిసిక్యాడేట్ లు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు.ఎన్ సిసినీ ఉపయోగించుకొని చాలా మంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ ఉ ద్యోగాలలో స్థిర పడటం జరిగింది అని, తెలుపుటకు ఎంతో గర్వంగా ఉ ందన్నారు.ఈ సందర్భంగా ఎన్ సిసి సెకండ్ ఆఫీసర్ బి.సాయిలును కిషోర్ కుమార్ అభినందించారు.ఈ కార్యక్ర మంలో అడ్మినిస్టేటివ్ స్వాతి,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,పాల్గొన్నారు.

## కాళేశ్వరం భూ గర్భంలో సమస్యలు

**కరీంనగర్,** : తెలంగాణలో రాజకీయంగా వివాదాస్పద అంశాల్లో ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్ట్ అతిముఖ్యమైనది. భారీ ఖర్చుతో నిర్మించిన ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మూడేళ్ల నుంచి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక విషయం బయటపడింది. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, మరియు సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భంలో అనేక సాంకేతిక లోపాలు ఉన్నట్లు గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ పరీక్షలలో తేలింది. బ్యారేజీల కొన్ని వెంట్స్ (నీరు ప్రవహించే మార్గాలు) కింద ఖాళీ ప్రదేశాలు ఏర్పడి నీరు చేరడం (కేవిటీస్), పెద్ద పరిమాణంలో బోల్డర్లు, దెబ్బతిన్న రాతి పొరలు, రాళ్ల దిగువ భాగాన పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ జియోఫిజికల్ పరిశీలనల ఆధారంగా పుణెలోని ప్రసిద్ధ కేంద్ర జల, విద్యుత్తు పరిశోధనా సంస్థ డైరెక్టరు సెల్వబాలన్ ఒక సమగ్ర నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపారు.

# తక్కువ ఖర్చుతో తాత్కాలిక రక్షణనిచ్చే 'షార్ట్-టర్మ్' బీమా





బీమా అనగానే ఏళ్ల పాటు చెల్లించాల్సిన ప్రీమియంలు, కఠినమైన నిబంధనలే గుర్తుకొస్తాయి. అయితే, మారిన వ్యాపార, ఆర్థిక అవసరాలకు తగ్గట్టుగా 'షార్ట్ టర్మ్ ఇన్సూరెన్స్' మంచి ప్రత్యామ్నాయంగా మారుతోంది. ముఖ్యంగా తాత్కాలిక పరిస్థితులను ఎదుర్కోవడానికి ఒకటి నుంచి ఐదు సంవత్సరాల కాలపరిమితితో వచ్చే 'షార్ట్ టర్మ్ ఇన్సూరెన్స్' ఒక అద్భుతమైన ఆర్థిక వ్యూహంగా ఉపయోగపడుతోంది.

సుదీర్ఘకాలం పాటు భారీ ప్రీమియంల భారం మోయాల్సిన అవసరం లేకుండానే.. ప్రయాణాలు, ఆరోగ్యం, ఆటోమొబైల్ లేదా వ్యాపార ప్రాజెక్టులకు సంబంధించి తక్షణమే ఎదురయ్యే నష్టాల నుండి ఇది పక్కా ఆర్థిక రక్షణను అందిస్తుంది. మారే పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉండటం వల్ల వ్యక్తులతో పాటు వ్యాపార సంస్థలకు ఇది సరైన ఆప్షన్‌గా మారుతోంది. సాంప్రదాయ లాంగ్-టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలతో పోలిస్తే షార్ట్-టర్మ్ బీమా ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అంతేకాకుండా తక్కువ ఖర్చుతో లభిస్తుంది.

కవరేజ్ కాలం పరిమితంగా ఉండటం వల్ల ప్రీమియం ధరలు తక్కువగా ఉంటాయి, దీనివల్ల జేబుకు చిల్లు పడకుండానే అనుకున్న సమయానికి రిస్క్ కవరేజ్ లభిస్తుంది. అంతేకాకుండా, ఈ పాలసీల దరఖాస్తు, క్లెయిమ్ ప్రక్రియలు చాలా వేగంగా, తక్కువ పేపర్ వర్క్‌తో పూర్తవుతాయి. చివరి నిమిషంలో అనుకోకుండా వచ్చే ప్రయాణాలు లేదా స్వల్పకాల బిజినెస్ ప్రాజెక్ట్‌లకు తక్షణ భరోసా ఇవ్వడంలో ఇవి ముందుంటాయి. వ్యాపారంలో లేదా వ్యక్తిగత జీవితంలో అద్దె కార్లు, ఈవెంట్ల నిర్వహణ, కాంట్రాక్ట్ ప్రాజెక్ట్‌ల వంటి తాత్కాలిక బాధ్యతలు ఉన్నప్పుడు ఈ పాలసీలు క్లిష్టమైన రిస్క్‌లను సమర్థవంతంగా మేనేజ్ చేస్తాయి. శాశ్వత కవరేజ్ అవసరం లేని చోట, ఎంత కాలానికి రక్షణ కావాలో అంత కాలానికే చెల్లించే వెసులుబాటు ఇందులో ఉంటుంది. నియమ నిబంధనలు కూడా చాలా సూటిగా, స్పష్టంగా ఉండటంతో పాలసీదారులు తమకు లభించే రక్షణను సులభంగా అర్థం చేసుకోవచ్చు. లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో కూడా ఈ షార్ట్-టర్మ్ బీమా పథకాలు అనేక ప్రయోజనాలను అందిస్తున్నాయి.

## తగ్గిన చమురు ధరలు..
### ఆర్థిక వ్యవస్థపై ప్రభావం




అమెరికా, ఇరాన్‌లు వరుసగా రెండో రోజు కూడా పర్షియన్ గల్ఫ్‌లో కొత్త సైనిక దాడులను నివారించడంతో, ఆదివారం ఉదయం ట్రేడింగ్‌లో ప్రపంచ చమురు ధరలు భారీగా పడిపోయాయి. ఈ తాత్కాలిక ఘర్షణల విరామం, ప్రపంచ ముడి చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందనే తక్షణ ఆందోళనలను తగ్గించింది. గత వారం చమురు ధరలు రెండు నెలల గరిష్ట స్థాయికి చేరిన నేపథ్యంలో, దీంతో వ్యాపారులు లాభాలను స్వీకరించడానికి ఇది దారితీసింది. మార్కెట్లు తిరిగి తెరుచుకున్న తర్వాత, ఉదయం ట్రేడింగ్‌లో ప్రపంచ ప్రమాణమైన బ్రెంట్ క్రూడ్ 4.9 శాతం పడిపోయి బ్యారెల్‌కు 92.02 డాలర్లకు చేరింది. శుక్రవారం నాడే ఈ ప్రమాణం 3.9 శాతం పడిపోయిన తర్వాత ఈ తగ్గుదల చోటుచేసుకుంది. గత వారం, బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 102 డాలర్ల మార్కును క్లుప్తంగా దాటింది. ఇది మే నెల తర్వాత దాని అత్యధిక స్థాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తీవ్రంగా దెబ్బతీసే విస్తృత ప్రాంతీయ సంఘర్షణ భయాలను పెంచడంతో, ఈ ప్రమాణం ఈ నెల ప్రారంభంలోని స్థాయిల నుండి దాదాపు 30 డాలర్లు పెరిగింది. మధ్యప్రాచ్య సంఘర్షణ చమురు ధరలను పెంచింది మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతల కారణంగా ఈ నెల మొత్తం చమురు ధరలు అస్థిరంగా ఉన్నాయి. ఇరాన్‌తో పూర్తిస్థాయి సంఘర్షణ చెలరేగితే, ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన కారిడార్లలో ఒకదాని నుండి ముడి చమురు రవాణా గణనీయంగా ప్రభావితం కావచ్చని పెట్టుబడిదారులు భయపడ్డారు. ఇరాన్ తీరప్రాంతంలో వ్యూహాత్మకంగా ముఖ్యమైన జలమార్గమైన హోర్ముజ్ (ఊనీతీఎబీళి) జలసంధి మార్కెట్‌కు అతిపెద్ద ఆందోళనగా ఉంది. ప్రపంచ చమురు ఎగుమతుల్లో దాదాపు ఐదవ వంతు, ప్రపంచ మార్కెట్లకు చేరడానికి ముందు సాధారణంగా ఈ ఇరుకైన మార్గం గుండానే వెళుతుంది. ఫిబ్రవరి చివరిలో అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి నుండి ఈ మార్గంలో నౌకా రవాణా కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి, దీంతో సరఫరాకు దీర్ఘకాలిక అంతరాయాలు ఏర్పడతాయనే ఆందోళనలు పెరిగాయి. అనేక చమురు ఉత్పత్తి దేశాలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రవాణాను మళ్లించడానికి ప్రయత్నించినప్పటికీ, ఆ ఎంపికలు కూడా ఒత్తిడికి గురయ్యాయి. గత వారం, ఎర్ర సముద్ర మార్గాన్ని ఉపయోగించే సౌదీ చమురు ట్యాంకర్లపై దాడి జరిగినట్లు సమాచారం, ఇది ప్రపంచ ఇంధన రవాణాకు పెరుగుతున్న ప్రమాదాలను ఎత్తి చూపుతోంది. సరఫరా లభ్యత తగ్గడం సాధారణంగా ముడి చమురు ధరలను పెంచుతుంది, దీని ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఖర్చులు మరియు రవాణా ఖర్చులు పెరుగుతాయి. ఇంధన ధరలు మరియు ద్రవ్యోల్బణం ప్రధాన ఆందోళనలుగా మిగిలి ఉన్నాయి ఇటీవలి ముడి చమురు ధరల పెరుగుదల ఇప్పటికే ఇంధన ధరలపై ప్రభావం చూపడం ప్రారంభించింది. మోటార్ క్లబ్ ౦౦౦ ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లో సాధారణ పెట్రోల్ సగటు ధర ఆదివారం నాడు గ్యాలన్‌కు 4.11 డాలర్లుగా ఉంది, ఇది నెల రోజుల క్రితం 3.90 డాలర్లు మరియు గత సంవత్సరం ఇదే కాలంలో 3.15 డాలర్లుగా ఉంది. నిలకడగా అధిక చమురు ధరలు ప్రపంచవ్యాప్తంగా వస్తువుల రవాణా వ్యయాన్ని పెంచుతాయని, కిరాణా సామాగ్రి నుండి వినియోగ వస్తువుల వరకు ఉత్పత్తులను మరింత ఖరీదైనవిగా చేస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్‌తో కొనసాగుతున్న సంఘర్షణ వినియోగదారుల విశ్వాసాన్ని బలహీనపరిచినప్పటికీ, అమెరికా ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తూనే ఉన్న సమయంలో ఇది సంభవించింది. చమురు ధరల పెరుగుదల ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడంలో సాధించిన పురోగతికి కూడా అంతరాయం కలిగించింది. ద్రవ్యోల్బణం ఊహించిన దానికంటే వేగంగా తగ్గుతున్న సంకేతాలు చూపిన తర్వాత, ఇంధన ధరలపై మళ్లీ తలెత్తిన ఒత్తిళ్లు పెట్టుబడిదారులలో మరోసారి ఆందోళనలను రేకెత్తించాయి.

## 'యూజర్‌నేమ్' వెరీ డేంజర్.. దేశ భద్రతకే సవాల్





ఆధునిక డిజిటల్ కమ్యూనికేషన్ రంగంలో అగ్రగామిగా ఉన్న వాట్సాప్.. వినియోగదారుల వ్యక్తిగత భద్రతను, ప్రైవసీని మరింత పటిష్టం చేసే ఉద్దేశంతో 'యూజర్ నేమ్' అనే ఫీచర్‌ను తెరపైకి తీసుకొస్తోంది. ఫోన్ నంబర్ వెల్లడించాల్సిన అవసరం లేకుండా కేవలం ఒక అనామక ఐడెంటిటీతో ఇతరులతో చాట్ చేసుకునే వీలు కల్పించడం పైకి స్వాగతించదగ్గ పరిణామంగానే కనిపిస్తోంది. అయితే.. భారతదేశం వంటి అత్యధిక జనాభా, విభిన్న సామాజిక సమీకరణాలు కలిగిన దేశంలో ఈ సాంకేతిక మార్పు కేవలం ఒక సౌకర్యంగా మిగిలిపోదు. ఇప్పటికే నిత్యజీవితంలో ఒక అత్యంత నమ్మకమైన ప్రామాణిక సమాచార వేదికగా రూపాంతరం చెందిన ఈ ప్లాట్‌ఫామ్‌లో యూజర్ నేమ్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఊహించని సామాజిక, ఆర్థిక, జాతీయ భద్రతా సంక్షోభాలు తలెత్తే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారిక గుర్తింపు లేకపోయే అవకాశం నేరగాళ్లకు ఒక రక్షణ కవచంగా మారితే, అది ఎలాంటి తీవ్ర పరిణామాలకు దారితీస్తుందో ఊహించడమే కష్టం. యూజర్ నేమ్ ఫీచర్ వల్ల తలెత్తే అతిపెద్ద ముప్పు దేశ భద్రత, సమగ్రతకు సంబంధించింది.

సరిహద్దుల అవతల ఉన్న శత్రు దేశాల ఇంటెలిజెన్స్ విభాగాలు లేదా ఉగ్రవాద సంస్థలు దేశంలో అలజడులు సృష్టించడానికి ఈ ఫీచర్‌ను పూర్తి స్థాయిలో వాడుకునే అవకాశం ఉంది.

సైనిక దళాలు, రక్షణ శాఖ లేదా ప్రజల్లో అత్యంత నమ్మకమైన ప్రధాన వార్తా సంస్థల పేర్లతో నకిలీ యూజర్ నేమ్స్ సృష్టించి, అంతర్గత భద్రతను దెబ్బతీసే తప్పుడు ప్రచారాలను క్షణాల్లో వైరల్ చేయవచ్చు. యుద్ధ సమయాల్లో లేదా అంతర్గత ఘర్షణల సమయంలో ఇలాంటి అకౌంట్ల ద్వారా వచ్చే ఫేక్ న్యూస్ ప్రజల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తించడం అత్యంత సహజం. ఆ ఒక్క మెసేజ్ వల్ల దేశంలో ఎంతటి అరాచకాలైనా జరుగవచ్చు. దీనికి తోడు, టెర్రర్ ఫైనాన్సింగ్ లేదా హ్యాకింగ్ లింకుల ద్వారా నిధులు వసూలు చేయడానికి కూడా ఈ యూజర్ నేమ్స్ వేదికలుగా మారవచ్చు. క్రిప్టోకరెన్సీ రూపంలోనో లేదా ఇతర డిజిటల్ మార్గాల్లోనో దేశం దాటిపోయే ఈ నిధుల మూలాలను కనిపెట్టడం నిఘా వర్గాలకు సైతం సవాలుగా మారుతుంది. భారతదేశంలో వాట్సాప్ గ్రూపులు, చాట్‌లకు సమాజంలోనూ, చట్టపరంగానూ ప్రాథమిక విశ్వసనీయత ఉంది. ఒక వ్యక్తి ఫోన్ నంబర్ ఆధారంగా అకౌంట్ నడుస్తుంది కాబట్టి, అందులో వచ్చే సమాచారాన్ని సాధారణంగా ప్రజలు నిజమని నమ్ముతారు. కానీ యూజర్ నేమ్ ఫీచర్ అందుబాటులోకి వస్తే, ఈ నమ్మకమే బాధితుల పాలిట శాపంగా మారే అవకాశం ఉంది. సమాజంలో ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు, మహిళలు లేదా వ్యాపారవేత్తల ఫొటోలను దొంగిలించి, వారి పేరును పోలిన యూజర్ నేమ్‌లతో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించడం అత్యంత సులభతరంగా మారుతుంది.

ఇలాంటి నకిలీ ఖాతాల ద్వారా అడల్ట్ కంటెంట్‌ను వ్యాప్తి చేయడం, అసభ్యకర చాటింగ్‌లు జరపడం ద్వారా అసలు వ్యక్తి ప్రమేయం లేకుండానే వారి క్యారెక్టర్‌ను పూర్తిగా డ్యామేజ్ చేయవచ్చు. ఈ చాట్‌ల తాలూకు స్క్రీన్‌షాట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయినప్పుడు, బాధితుడు తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫారమ్‌లలో అధికారిక గుర్తింపు లేకపోయే అవకాశం ఎక్కువ కాబట్టి అక్కడ జరిగే విషయాలను సమాజం అంతగా ప్రామాణికంగా తీసుకోదు.. కానీ, వాట్సాప్‌లో జరిగే ఇంపర్సనేషన్ (ఒకరి పేరుతో మరొకరు చేసే మోసం) తీవ్రమైన మానసిక క్షోభకు, సామాజిక బహిష్కరణలకే కాకుండా ఆత్మహత్యల వంటి దారుణాలకు దారితీసే ప్రమాదం ఉంది.

## వాహనదారులకు గుడ్ న్యూస్....




అమెరికా, ఇరాన్ యుద్ధం కారణంగా నెలకొన్న ఇంధన సంక్షోభం వేళ.. భారీగా పెట్రోల్ రేట్లను పెంచిన నయారా ఎనర్జీ సంస్థ తమ కష్టమర్లకు శుభావార్తను అందించింది. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ ఇంధన రిటైలర్ సంస్థ వాహనదారులకు భారీ ఊరటనిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు (అతీబీటవ ాతిశ్రీ) ధరలు గణనీయంగా తగ్గడంతో దేశవ్యాప్తంగా తమ బంకుల్లో ఇంధన ధరలను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఇందులో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ. 5, అలాగే లీటర్ డీజిల్‌పై రూ. 3 చొప్పున తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా 7,000 కంటే ఎక్కువ పెట్రోల్ పంపుల నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న నయారా ఎనర్జీ తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వచ్చింది. ఒకవైపు ప్రైవేట్ రంగ చమురు సంస్థ నయారా రేట్లను తగ్గించినప్పటికీ.. దేశంలో మెజారిటీ
మార్కెట్ వాటా కలిగిన ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు మాత్రం ధరలను యథాతథంగా ఉంచాయి. ప్రైవేట్ బంకుల్లో ఇంధనం చౌకగా లభిస్తుండటంతో, ప్రభుత్వ రంగ సంస్థలు కూడా తక్షణమే
స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని దేశవ్యాప్తంగా వాహనదారులు, రవాణా రంగ ప్రతినిధులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలు కూడా ధరలు తగ్గిస్తే సామాన్యులకు మరింత మేలు జరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


## డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు భారీ డిమాండ్



దేశంలో పెళ్లిళ్ల తీరు వేగంగా మారుతోంది. భారీ అతిథుల జాబితా, ఆర్భాట వేడుకల కంటే కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి ప్రత్యేక అనుభవాన్ని ఆస్వాదించే 'డెస్టినేషన్ వెడ్డింగ్'ల వైపు ఎక్కువమంది మొగ్గు చూపుతున్నారు. వెడ్‌మీగూడ్ విడుదల చేసిన 'డెస్టినేషన్ వెడ్డింగ్ రిపోర్ట్ 2026' ప్రకారం, ప్రస్తుతం దేశంలోని మొత్తం పెళ్లిళ్లలో దాదాపు నాలుగింట ఒక వంతు డెస్టినేషన్ వెడ్డింగ్‌లే ఉండగా, 2028 నాటికి ఈ వాటా 30-32 శాతానికి చేరే అవకాశం ఉంది. డెస్టినేషన్ వెడ్డింగ్‌ల సగటు బడ్జెట్ కూడా ఏడాదిలో 8 శాతం పెరిగి రూ. 58 లక్షలకు చేరుకుంది. ఇంటర్నేషనల్ డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు సగటు ఖర్చు రూ. 1.5 కోట్లకు పైగానే ఉంది.

ప్రస్తుతం 42 శాతం మంది భారీ వేడుకల కంటే చిన్న కార్యక్రమాలనే ఇష్టపడుతున్నారు. అతిథులకు ప్రత్యేక ఆహారం, వెల్‌నెస్ యాక్టివిటీలు, ఎక్కువ రోజుల వేడుకలు వంటి అంశాలకు ప్రాధాన్యం పెరగడంతో, డెస్టినేషన్ వెడ్డింగ్‌ల సగటు వ్యవధి 2020కి ముందు 1.8 రోజుల నుంచి ఇప్పుడు 3.2 రోజులకు పెరిగింది. రానున్న సంవత్సరాల్లో ఆసియా దేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని, వ్యక్తిగత అనుభవాలు, లగ్జరీ ప్రయాణం, ప్రత్యేక వేడుకలకే భారతీయ జంటలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టు నివేదిక పేర్కొంది.

## నేపాల్‌లో రూ. 200, రూ. 500 నోట్లు చెల్లుతాయి



దాదాపు పదేళ్ల తర్వాత భారతీయ కరెన్సీపై నేపాల్ కీలక నిర్ణయం ప్రకటించింది. ఇకపై భారతీయులు, నేపాలీ పౌరులు ఒక్కొక్కరు గరిష్టంగా రూ. 25,000 విలువైన రూ. 200, రూ. 500 భారతీయ నోట్లను నేపాల్‌లోకి తీసుకెళ్లవచ్చు, అక్కడి నుంచి తీసుకురావచ్చు. 2016 నవంబర్ 9 తర్వాత జారీ చేసిన వాటికి అనుమతి ఉంటుంది. 2016లో మనదేశంలో పెద్ద నోట్ల రద్దు తర్వాత నేపాల్ రూ. 100 కంటే ఎక్కువ విలువైన భారత కరెన్సీపై నిషేధం విధించింది. తాజా నిర్ణయంతో ఆ ఆంక్షలకు కొంతమేర సడలింపు లభించింది. అయితే పాత డిజైన్‌లోని రూ. 500, రూ. 1,000 నోట్లు ఇప్పటికీ చెల్లవు. నేపాల్ రాష్ట్ర బ్యాంక్ (ఎన్‌ఆర్‌బీ) ఈ నిబంధనలను మరోసారి స్పష్టం చేస్తూ, నేపాలీ పౌరులు భారత్ మినహా ఇతర దేశాల నుంచి భారతీయ కరెన్సీ తీసుకురావద్దని, అలాగే భారత్ తప్ప వేరే దేశాలకు తీసుకెళ్లరాదని తెలిపింది. ఈ నిర్ణయం వల్ల భారత్?నేపాల్ మధ్య పర్యాటకం, సరిహద్దు వాణిజ్యం, ప్రజల రాకపోకలు మరింత సులభం కానున్నాయి. ఇకపై భారతీయులు, నేపాలీ పౌరులు ఒక్కొక్కరు గరిష్టంగా రూ. 25,000 విలువైన రూ. 200, రూ. 500 భారతీయ నోట్లను నేపాల్‌లోకి తీసుకెళ్లవచ్చు, అక్కడి నుంచి తీసుకురావచ్చు. 2016 నవంబర్ 9 తర్వాత జారీ చేసిన వాటికి అనుమతి ఉంటుంది. 2016లో మనదేశంలో పెద్ద నోట్ల రద్దు తర్వాత నేపాల్ రూ. 100 కంటే ఎక్కువ విలువైన భారత కరెన్సీపై నిషేధం విధించింది. ముఖ్యంగా భారత్‌కు పర్యాటకులు, చిన్న వ్యాపారులకు ఇది అతిపెద్ద ఊరటగా మారనుంది.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com